# ఇందలినీతి : చెడలేదు

సుబ్బారావున్నరగంటలు కావొస్తున్నది. సీత ఎదురు చూస్తున్నది. చిమ్మచీకట్లు కమ్ముకొంటున్నాయి. సీత పెరట్లో నూతిదగ్గర కాచుకొని కూర్చుంది. ఆందోళన మనస్సులో అలముకుంటున్నది. సీత సీతని ప్రశ్నిస్తున్నది. సుబ్బారావున్నరగంటలు సీత గుండెల్లో కొట్టేరు. సీత ఎదురు చూస్తున్నది.

సుబ్బారావు వచ్చేడు. ఆందోళన మనస్సులో అలముకొంటున్నది. సుబ్బారావు సీతపక్కన కూర్చున్నాడు. సీత ఎదురుచూస్తున్నది. సుబ్బారావు మాట్లాడేడు. చిమ్మ చీకట్లు తొలగుతున్నాయి. సుబ్బారావున్నర గంటలు సీత గుండెల పూర్తయేయి.

సుబ్బారావు సీతని ప్రశ్నించేడు. ఆందోళనా, చిమ్మ చీకట్లు అలముకొంటున్నాయి. సీత గుండెల్లో వాచీ ఆగి పోయింది. సీత కాచుకొని ఎదురుచూస్తున్నది. సుబ్బారావు 'కీ' ఇచ్చాడు.

సీత సీతని ప్రశ్నించింది. సుబ్బారావు యిచ్చిన సలహాని కూడబలుక్కొని సీత పాలిపోయింది. పాలిపోయిన ఆ గొంతుకలో స్వరపేటిక ఆర్చుకుపోయింది. సీతగొంతుక సీసాకి సీలువేసిన బిరడా ఊడి రాలేదు.

సుబ్బారావు ఇచ్చిన సలహాని సీతమనస్సు కూడ బలుక్కొంది. సీత మనస్సు తేలికైంది. తేలికైన ఆమన

స్సులో పరిమళాలు ప్రచారం చేస్తున్నాయి. సీతమనస్సు సం కెళ్ళు ఊడిపోయాయి.

సుబ్బారావు ఇచ్చిన సలహాని సీతమనస్సులో సీత నివసిస్తున్న సంఘం కూడ బలుకొంది. సీత-సంఘం వెర్రెత్తి పోయింది. వెర్రెత్తిన ఆసీత సంఘం సకిలించింది. దాని నోటికి తాళం లేదు.

సుబ్బారావు ఇచ్చిన సలహాని సీతభవితవ్యం కూడ బలుకొంది. సీతభవితవ్యం చీకట్లో చిక్కుకుంది. చీకట్లో చిక్కుకున్న ఆ భావినిండా ప్రశ్నార్థకపు కుర్తులు. వాటిని పరిష్కరించిందికి మార్గాలు—

సుబ్బారావు అన్నాడు. 'సీతా! నువ్వేం ఇడవకు. నిన్ను ఈ నరకంలోంచి లేవదీసుకుపోయే ధైర్యం నాకుంది. ఈ గొడవని కోర్టుదాకా ఈడ్చేదమ్ములు నీమొగుడికి లేవని నేను దస్తావేజు రాసి ఇస్తాను. బాగా ఆలోచించుకో.

సీత ఆలోచించుకొంది. సీతా, సీతమనస్సు, సీతమన స్సులో నివసిస్తున్న సంఘం, సీతభవితవ్యం బాగా ఆలో చించుకొన్నాయి. సీత పాలిపోయింది. సీత గుండెల్లో వాచీ అలారం కందిరీగలా రొదచేస్తున్నది.

సుబ్బారావు భవితవ్యం, సుబ్బారావు ఆర్థిక సమస్యలు చిమ్మచీకట్లలా సీతమనస్సులో కమ్ముకున్నాయి. తమ ఉమ్మడి జీవితంచుట్టూ ఉండబోయే సంఘం చేయబోయే ఆందోళన సీతగుండెల్లో అలముకొంటున్నాది. సీత ఆలోచ నలు మండుతున్నాయి.

సుబ్బారావు మళ్ళా అన్నాడు: 'సీతా! నువ్వేం ఇద వకు. నిన్ను పువ్వుల్లో పెట్టుకొంటా. మన కేం లోపం రాదనే ధైర్యం నాకుంది. డబ్బుగురించీ, నా చిక్కులగురించీ నువ్వే బెంగపెట్టుకోకు. మదరాసులో మనం బతకలేకపోం, బాగా ఆలోచించుకో.

సీత బాగా ఆలోచించుకొంది. సీతమనస్సు కిందా మీదా పడ్డాది. సీత సమస్యల పద్మవ్యూహంలో చిక్క డ్డాది. సీత ఉక్కిరిబిక్కిరి అయింది. సీతకి సుబ్బారావు చేయూతకాక మరొకరిసలహా చాలా అవసరమైంది.

సుబ్బారావున్నర గంటలుకొట్టకముందూ సీత సుబ్బా రావే తన్ని రక్షించగల, తనకి సలహానివ్వగలవాడని నిర్ధా రణ చేసుకొంది. తీరా సుబ్బాగావు ఇచ్చిన సలహాని చదువు కొన్న తరువాత సీత బెంబేరెత్తిపోయింది.

మరో గత్యంతరం లేదనుకొంది. ఈ సమస్యకి మరో విధంగా పరిష్కారం జరగదని సీత అనుకొంది గాని సుబ్బా రావు ఈ సలహాని అందివ్వగానే సీత గుండెల్లో ఎవరో నిప్పులు చెరుగుతున్న ట్టనిపించింది.

సీత చదువుకొన్నదే. సీత పిరికిది కాదు. కాని సీతకి ముందూ వెనకా ఉన్నారు. అందుకే సీత వెనకాడుతూ ఉంది. అందుకే సుబ్బారావు సలహాని వల్లెవేసుకొని సీత పాలిపోయింది.

సుబ్బారావు రెచ్చకొట్టేడు; 'సీతా! రేపీపాటికి మళ్ళా ఆ నరకంలో-ఆ పాముపడగకింద-ఆ గంధకజ్వాలల్లో-రేపీపాటికి; బాగా ఆలోచించుకో, రేప్పొద్దున్న, నీ మొగుడు యమధర్మరాజులా వస్తాడు రేప్పొద్దున. బాగా ఆలోచించుకో! రేపీపాటికి బాగా ఆలోచించుకో!

చివరికి సీత 'అయితే' అని ఊరుకొంది. సీత గొంతుకలోని స్వర పేటికని సవరించుకొన్నా ఆఒక్కమాట తప్పించి మరేం పలకబడలేదు. సుబ్బారావు ఆమాటనే పొడిగించి నివురు ఊదేడు.

సీతకి జువ్విచెట్టుమీద దెయ్యాన్ని చూసినంతభయం పట్టుకొంది. సుబ్బారావు మరి నాల్గు నిమిషా లక్కడుంటే తను ముందూ వెనకా చూసుకోకుండా తనముందూ వెనక ఉన్నవాళ్ళని నూతిలోనూ గోతిలోనూ దింపేయవచ్చని భయపడింది.

భయంతో సీత గొంతుకలోని తీగెలు ఒక్కసారి 'లాభంలేదు' అని పలికేయి. గంటసేపు అదేపల్లవి సుబ్బారావు గుండెల్లో. వాచీ ఆగిపోయింది. సుబ్బారావులో చిమ్మచీకట్లు కమ్ముకొన్నాయి. సుబ్బారావు ఆందోళనలో ఈదలేకపోతున్నాడు.

ఇంక సుబ్బారావుజీవితంలో సీతంపావుగంటలుండవు. సుబ్బారావు 'బాగా ఆలోచించుకో' అన్నాడు. సుబ్బారావు వెళ్ళిపోయాడు.

సుబ్బారావున్నరగంటలు అయిపోయేయి. సీత ఎదురు చూస్తున్నది. చిమ్మ చీకట్లు కమ్ముకొన్నాయి. సీత పెరట్లో నూతులోకి చూస్తున్నది. సీత సీతకి జవాబు చెప్పుకొంది. సీతకి ముందూ వెనకా ఉన్నారు. సీత పిరికిది. సీతకి చదువులేదు. ఆసీత నరకంలోకి – పాము పడగకిందకి – గంధక జ్వాలల్లోకి—